క్లుప్తంగా

గిరిజన దర్బార్ నిర్వహించాలి

మన్ననూర్: ఆదివాసి చెంచుల సమస్యల సత్వర పరిష్కారం కోసం మన్ననూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన దర్బార్ నిర్వహించాలని ఆదివాసి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాసులు మంగళవారం అధికారులను ఓ ప్రకటనలో కోరారు. నల్లమల చెంచులకు అందుబాటులో ఉన్న మన్ననూర్ గ్రామంలోని ఐటీడీఏ ప్రాంగణంలో గతంలో ప్రతి గురువారం చెంచుల కోసం దర్బార్ నిర్వహించే వారని గుర్తు చేశారు. మళ్లీ పాలకులు, అధికారులు స్పందించి గిరిజన దర్బార్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

కేజీబీవీ ఉపాధ్యాయులకు భద్రత కల్పించాలి



చారకొండ: కొన్ని సంవత్సరాలుగా కేజీబీవీలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు భద్రత కల్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు చిన్నయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆ సంఘం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేజీబీవీలో ఎళ్ల తరబడి పనిచేస్తున్న వారిని గుర్తించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఏ మంజుల, ఉపాధ్యాయులు వినోద, సువర్ణ, కోట్యా, రవీందర్, తిరుపతి, దేవేందర్, తదితరులు ఉన్నారు.

హామీల అమలుకు ప్రభుత్వం కృషి



పెంట్లవెల్లి: ఆరు గ్యారంటీ పథకాల అమలుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేరుస్తారన్నారు. కొల్లాపూర్ ప్రాంతాన్ని అభివృద్ధి కోసం మంత్రి జూపల్లి కృష్ణారావు ముందుకు వెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో కుమార్, శేఖర్, వినోద్‌లు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అచ్చంపేట: భవన నిర్మాణ తాపీ కార్మిక నూతన నియోజకవర్గ అధ్యక్షుడిగా మీసుగ ఖాజా, ప్రధాన కార్యదర్శిగా యం.తిరుపతయ్య, కోశాధికారి ఎస్‌కె అమీర్‌లను ఎన్నుకొన్నారు. అదేవిధంగా ఉపాధ్యక్షుడిగా బి.కిష్టయ్య, సంజీవులు, సహాయ కార్యదర్శులు డి.తిరుపతయ్య, బెల్లి తిరుపతి, ఉప్పరి సుధాకర్, కార్యదర్శి నడింపల్లి శేఖర్, సహాయ కోశాధికారి శ్రీరాములు, గౌరవ అధ్యక్షుడు బిచ్చయ్య, బాబు సాగర్, సాంబయ్య తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పి.హరిశ్చంద్ర, సీమాన్‌లు పాల్గొన్నారు.

నర్సరీల పరిరక్షణ అందరి బాధ్యత



కల్వకుర్తిరూరల్: నర్సరీల పరిరక్షణ అందరి బాధ్యత అని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని జంగారెడ్డిపల్లి, ఎల్లికల్, మార్చాల తదితర గ్రామాల్లో చేపట్టిన పనులను పరిశీలించి నర్సరీలను ఆయన సందర్శించారు. హరితహారం కార్యక్రమం ప్రారంభం అయ్యేనాటికి మొక్కలను సిద్ధం చేయాలని నిర్వాహకులకు సూచించారు. మొక్కలు ఎండకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ తదితరులు ఉన్నారు.

పేదలకు అండగా ఉంటాం



కల్వకుర్తిరూరల్: పేదలకు అండగా ఉంటామని స్వామి వివేకానంద సేవాబృందం అధ్యక్షుడు శివ అన్నారు. మంగళవారం పట్టణానికి చెందిన కృష్ణయ్య పాత దుస్తులను స్వామి వివేకానంద సేవాబృందం సభ్యులకు అందించారు. ఈ మేరకు దుస్తులను పట్టణంలోని గుడిసెలలో నివాసం ఉంటున్న వారికి సేవాబృందం అధ్యక్షుడు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మనీష్, చింటు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న మొక్కలు

- పట్టించుకోని అధికారులు



పెంట్లవెల్లికి వెళ్లే దారిలో



మంచాలకట్ట శివారులో ఎండిపోయిన మొక్కలు

పెంట్లవెల్లి: పల్లెల్లో పచ్చదనం, అటవీ విస్తరణ కోసం గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఊరూరా మొక్కలు నాటారు. గుట్టలు, రోడ్ల వెంట మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా రోడ్లకు ఇరువైపులా అధికారులు, నాయకులు మొక్కలు నాటారు. అంతాబాగానే ఉన్న ప్రస్తుతం నాటిన మొక్కలు ఎండుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ప్రభుత్వం ఎన్నో రూ.కోట్ల నిధులు వెచ్చించి మొక్కలు నాటితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం వృథా అవుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఏ గ్రామానికి వెళ్లినా, రోడ్డు ఇరువైపులా ఎండిపోయిన మొక్కలే దర్శనమిస్తున్నాయి. రక్షించాల్సిన అధికారులు పత్తాలేకుండా పోయారని స్థానికులు విమర్శిస్తున్నారు. మొక్కలు కాపాడటంతో అధికారుల, పాలకులు పూర్తిగా విఫలం అయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో హరితహార కార్యక్రమం ప్రారంభం అయిన తరువాత 2020–21 సంవత్సరంలో డిస్టిక్ రూరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో 80 వేల మొక్కలు సరఫరా చేశారు. 2021–22 సంవత్సరంలో 50 వేల మొక్కలు, హౌసింగ్ పర్పస్‌లో 40 వేల మొక్కలు 2022–23లో 30 వేల మొక్కలు, హౌసింగ్ పర్పస్‌లో 40 వేల మొక్కలు, 2023–24లో 20 వేల మొక్కలు, హౌసింగ్ పర్పస్‌లో 40వేల మొక్కలను మండలానికి అందాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం నర్సరీలలో పెరుగుతున్న మొక్కలు తప్పా రోడ్ల వెంట మొక్కలు కనిపించని దుస్థితిలో ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు, సర్పంచ్‌లు వచ్చే హరితహారం కార్యక్రమంలో నాటే మొక్కలకు రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రతి మొక్కను కాపాడుతాం

హరితహారంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను కాపాడుతాం. మొక్కలకు నీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. అక్కడక్కడ మొక్కలు ఎండుతున్నది వాస్తవమే. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అధికారులకు సూచనలు చేస్తాం.

– రామయ్య, ఎంపీడీఓ

అధికారులు పట్టించుకోవడం లేదు



ప్రతి సంవత్సరం హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో నాటిన మొక్కలు ఎండుతున్నాయి. అధికారులు మొక్కల సంరక్షణకు శ్రద్ధ చూపడం లేదు. ఇప్పటికైనా ప్రజాధనం వృథాకాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మొక్కల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి.

– కుమార్, పెంట్లవెల్లి

అడవులను కాపాడుకుందాం



మొలచింతపల్లిలో అవగాహన కల్పిస్తున్న రేంజర్ శరత్ చంద్రారెడ్డి

కొల్లాపూర్ రూరల్: అటవీ సంరక్షణపై అందరి బాధ్యత అని ఫారెస్టు రేంజర్ శరత్ చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నల్లమల అటవీ సంరక్షణపై మొలచింతపల్లి, నార్లాపూర్ గ్రామస్తులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్ల, పశువుల కాపరులు, రైతులు అగ్గిపెట్టితో అటవీ ప్రాంతంలోకి ప్రవేశించొద్దన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శివమాలధారులు అటవీ మార్గంలో కాకుండా వేరే మార్గంలో వెళ్లాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ప్రజలు పాల్గొన్నారు.

సమాజసేవలో యువత భాగస్వాములవ్వాలి

కల్వకుర్తి: యువత సామాజిక సేవలో భాగస్వాములవ్వాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మున్సిపాలిటీ పరిధిలోని సిలార్‌పల్లి వార్డులో సీతారామంజనేయ స్వామి నూతన దేవాలయం, వార్డు ప్రధాన ద్వారం శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిలార్‌పల్లిలోని యువజన సంఘం సభ్యులు వారి వార్డుకు కావల్సిన అవసరాలను గుర్తించి విడతల వారీగా వాటిని అమలు చేయటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, పలువురు నాయకులు, వార్డు ప్రజలు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



అమ్రాబాద్: మండలంలోని మాదవానిపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు గాజుల వెంకటేష్ మంగళవారం అదే గ్రామానికి చెందిన నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. గురుకుల పాఠశాలలో ఐదోతరగతి ప్రవేశాల కోసం ఫిబ్రవరిలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఈ మెటీరియన్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రోహిణి

తాడూరు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని జెడ్పీటీసీ రోహిణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు షీటీం పలు సామాజిక విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. విద్యార్థినుల రక్షణే లక్ష్యంగా పనిచేస్తున్న షీటీం సభ్యులకు ఆమె అభినందనలు తెలిపారు. షీటీం సిబ్బంది సూచనలు, జాగ్రత్తలను విద్యార్థినులు పాటించాలని కోరారు. వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ యాదమ్మ, ఎంపీటీసీ రేణుక, ఎంపీడీఓ గంగమోహన్, కృష్ణారెడ్డి, ఎస్‌ఓ విజయ పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి



నాగర్‌కర్నూల్ జిల్లా నెల్లికొండ ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్

కందనూలు: జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి ప్రిన్సిపాల్ కమర్ షాజహాన్ సుల్తానా పూలమాల వేసి నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ షేక్ ఖాజాబీ, ఇతర అధ్యాపక బందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: మండలంలోని నడింపల్లి ప్రాథమిక పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. నేతాజీ జీవితం స్ఫూర్తిదాయకమని ప్రధానోపాధ్యాయుడు సామ్య నాయక్ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు శంకర్, శ్రీశైలం, జయమ్మ, స్వాతి ఉన్నారు.

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని నాగర్‌కర్నూల్ రోడ్డులో ఉన్న నేతాజీ యువజన సంఘం భవనంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి ఆస్పత్రి సూపరింటెండెంట్ శివరాం, నేతాజీ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని స్థానిక బాలుర, బాలికల ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు నేతాజీకి ఘన నివాళులర్పించారు. నేతాజీ జీవిత చరిత్రను, స్వాతంత్య్ర పోరాటంలో నేతాజీ పాత్రను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు లక్ష్మీనారాయణ, నర్సింహ్మారెడ్డి, ఉపాధ్యాయులు బాలమణి, వెంకటేష్, పద్మావతి, వెంకటలక్ష్మి, రామచంద్రారెడ్డి, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, శేషగిరి, శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని సిద్దార్థ మోడల్ పాఠశాలలో సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్ పూలమాలలు నివాళులర్పించారు. విద్యార్థులు దేశభక్తిని కలిగి ఉండాలన్నారు. శివప్రసాద్, పాఠశాల కరస్పాండెంట్ ఎం విజయ్ గౌడ్, సువర్ణ, రామస్వామి, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

మన్ననూర్: స్థానిక ఓం చౌరస్తాలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి విశ్వహిందు పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు సంబు వెంకటరమణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ రహీం, నాయకులు వెంకటేశ్వర్లు, శివాజీ, కృష్ణయ్య, శంకర్, వెంకటయ్య, రాజేంద్ర ప్రసాద్, రాజు పాల్గొన్నారు.



అచ్చంపేట మండలం నడింపల్లిలో



కల్వకుర్తిలో



ఉప్పునుంతల బాలికల ప్రాథమిక పాఠశాలలో



తెలకపల్లి సిద్ధార్థ మోడల్ పాఠశాలలో



మన్ననూర్‌లో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కేవీపీఎస్ నాయకుల ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ఎస్సీ కార్పొరేషన్‌లో అవినీతికి పాల్పడిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆ సంఘ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాశన్న మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్‌లో నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వాన్ని మోసం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవినీతి అధికారులపై విచారణ చేపట్టాలన్నారు. రైతులకు సబ్సిడీ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమ, సత్యనారాయణ, శివరాం, శ్రీనివాస్, నర్సింహా, రాములు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న సబ్ పోస్టుమాస్టర్ రవికుమార్

పెద్దకొత్తపల్లి: పోస్టల్ సేవలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలి సబ్ పోస్టుమాస్టర్ రవికుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పోస్టల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు పోస్టాఫీసుల్లో ఉన్న పొదుపు ఖాతాలను గురించి ప్రజలకు వివరించి వారి నుంచి ఖాతాలను తెరిపించాలన్నారు. సుకన్య సమృద్ధి యోజనా, రికవరీ డిపాజిట్లు, సేవింగ్ బ్యాంక్, తపాలా బ్యాంకు పొదుపు ఖాతాలను ఎక్కువ శాతం సేకరించాలన్నారు. కార్యక్రమంలో తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీపై సమావేశం

వెల్దండ: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ విజయ అధ్యక్షతన మంగళవారం ఉపాధి హామీ సామాజిక తనిఖీపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ విజయ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన వివిధ పనులపై ప్రత్యేక బృందం తనిఖీ చేసేందుకు వచ్చారని పేర్కొన్నారు. రికార్డుల పరిశీలన, పనుల నాణ్యత, కూలీలకు చెల్లించిన డబ్బుల వివరాలు, చేపట్టిన పనులకు పూర్తి స్థాయిలో వచ్చే బిల్లులు తదితర వాటిని బృందం పరిశీలిస్తుందని వివరించారు. తనిఖీ బృందానికి సిబ్బందితో పాటు కూలీలు సహకరించాలని కోరారు. మండలంలో మొత్తం 11 టీమ్‌లతో సామాజిక తనిఖీ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్, ఎస్‌ఆర్‌పీ అనిల్‌కుమార్, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా తహసీల్దార్ భవన నిర్మాణ పనులు



పెద్దకొత్తపల్లిలో తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో తహసీల్దార్ నూతన భవన సముదాయ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 40 ఏళ్ల నుంచి తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలోనే కొనసాగుతుంది. దీంతో గతంలో కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తహసీల్దార్ భవన నిర్మాణానికి రూ.1.30 కోట్ల నిధులు మంజూరు చేయించారు. నవంబర్‌లో పనులు ప్రారంభించగా ప్రస్తుతం పనులు ఊపందుకున్నాయి. మరో రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామని సంబంధిత శాఖ అధికారులు పేర్కొన్నారు.

గుంతలకే పరిమితం



లింగాల మండలం అప్పాయపల్లిలో ఇలా

లింగాల: మండలంలోని అప్పాయపల్లిలో గ్రామ పంచాయతీ భవనం నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. పాత భవనం శిథిలావస్థకు చేరడంతో పంచాయతీ కార్యకలాపాలను ఆంజనేయస్వామి గుడి పక్కన ఉన్న డ్వాక్రా భవనంలో పరిపాలన కొనసాగిస్తున్నారు. పంచాయతీ నూతన భవన నిర్మాణం కోసం ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా రూ.21 లక్షలు మంజూరు అయ్యాయి. సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. పిల్లర్ల కోసం గుంతలను తీసి వదిలేశారు. చేపట్టిన పనులకు నేటి వరకు బిల్లులు రాక పోవడంతో పనులు చేయడం లేదని గ్రామస్తులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి పంచాయతీ భవన నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: ఓటమితో కార్యకర్తలు, నాయకులు అధైర్యపడొద్దని.. అండగా ఉంటామని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండలస్థాయి పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో సక్రమంగా ప్రచారం చేసుకోలేకపోవడం, నాయకుల మధ్య అనైక్యత, పొరపాట్లతో నియోజకవర్గంలో ఓటమి పొందామని వివరించారు. గతంలో జరిగిన పొరపాట్లను సరిచేసుకొని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ రానున్న పార్లమెంటు, స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేద్దామని కోరారు. గతంలో నియోజకవర్గానికి మంజూరైన అభివృద్ధి పనులను ఎలాంటి ఆటంకం కలిగించకుండా పూర్తి చేసేందుకు, కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీ హామీల అమలుపై పోరాటాలు చేయాలన్నారు. గ్రామ, మండల కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. పార్టీకి నష్టం కలిగించే వారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, చంద్రశేఖర్ నాయక్, వెంకటయ్యనాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దామోదర్‌రెడ్డి, శేఖర్, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, వీరసాగర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

పాన్‌గల్: మండలంలో వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాములు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీకుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తాగునీటిపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. మండలంలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించాలని, దీంతో పాటు సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను గుర్తించి ఆయా వివరాలను సంబంధిత అధికారులకు అందించాలని ఆదేశించారు.